

సుపరిపాలనకు ఏడాది

చిత్తూరు సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆశీస్సులతో 'సుపరి పాలన'కు ఏడాది పూర్తయిందని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా జిల్లావ్యాప్తంగా టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి.చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే జగన్మోహన్ కార్యాలయంలో గురువారం ఉదయం టీడీపీ నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ పెన్షన్ పెంపు, ఉచిత సిలిండర్లు, తల్లికివందనం,16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ లాంటి హామీలు తొలి ఏడాదిలోనే అమలు చేసి చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో హైరోడ్డు విస్తరణ, తాగు నీటి ఏర్పాట్లు, రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం, చెరువుల సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.మేయర్ అముద, టీడీపీ నేతలు సురేంద్రకుమార్, ఏఎస్ మనోహర్, చెన్నకేశవులు నాయుడు, కోదండయాదవ్, కార్జాల అరుణ, త్యాగరాజన్, మోహన్‌రాజ్, రాజశేఖర్, మేషాక్, అశోకన్, వరలక్ష్మి, నాగలక్ష్మి, ప్రతిభ, అనురాధ తదితరులు పాల్గొన్నారు



అక్కడక్కడా చిరుజల్లులు

సోమల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల కదలికతో గురువారం సాయంత్రం చిత్తూరు, వెదురుకుప్పం,సోమల మండలాల్లో వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో అల్లాడిన జనానికి చిరుజల్లులతో వాతావరణం ఆహ్లాదంగా మారడం ఉపశమనాన్ని ఇచ్చింది. ఈ క్రమంలోనే సోమలలో దర్శనమిచ్చిన ఇంద్రధనస్సు ఆకట్టుకుంది.



తరగతి గదిలో ఒంటరిగా ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి

పాడ్యమి అని పాఠశాలకు రాలా

రొంపిచెర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. అయితే రొంపిచెర్ల మండలం మోటుమల్లెల పాలెం ప్రాథమిక పాఠశాలకు మాత్రం దినశుద్ధి బాగలేదని ఒక్క విద్యార్థి కూడా స్కూల్‌కు రాలేదు.పాఠశాలలో మొత్తం 13మంది చదువుతుండగా గురువారం పాడ్యమి కావడంతో తమ పిల్లలను బడికి పంపలేదని పిల్లల తల్లిదండ్రులు తెలిపారు.

వరసిద్ధుడికి రికార్డు స్థాయి హుండీ ఆదాయం



ఐరాల(కాణిపాకం), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో లభించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆలయానికి 26 రోజుల వ్యవధిలో రూ.2,18,93,556 సమకూరిందని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో ఈవో ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం హుండీ కానుకలను లెక్కించారు. 609 యూఎస్ఏ, 20 సింగపూర్, 60 కెనడా, 325 ఆస్ట్రేలియా డాలర్లు, 41 మలేసియా రింగిట్స్, 25 యూఏఈ దిర్హామ్స్, 25 ఇంగ్లాండ్ పౌండ్లతోపాటు 29 గ్రాముల బంగారు, 2 కిలోల 350 గ్రాముల వెండి లభించింది. వీటితోపాటు గోసంరక్షణ హుండీ ద్వారా రూ.17,107, నిత్యాన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.42,877 సమకూరాయి. ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవ రెడ్డి, ధనంజయ, ధనపాల్, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ కోదండపాణి, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొన్నారు.

1,30,382 మందికి 'తల్లికి వందనం'

చిత్తూరు సెంట్రల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇచ్చిన హామీల్లో ఒకటైన 'తల్లికి వందనం' అమలుకు అడుగులు పడ్డాయి. జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 2,64,679 మంది విద్యార్థులు ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్, ప్రైవేటు తదితర యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్నారు. వీరిలో 2,06,541 మంది విద్యార్థులకు చెందిన 1,30,382 మంది తల్లులు ఈ పథకానికి అర్హులుగా నిలిచారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో 24వ స్థానం

చిత్తూరు సెంట్రల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్య ప్రకటించిన టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో 59.25 శాతం ఉత్తీర్ణతతో మన జిల్లాకు 24వ స్థానం దక్కింది. జిల్లాలో 6,613 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 3918 మంది పాసవగా, 2695 మంది ఫెయిలయ్యారు. వీరిలో 4,080 బాలురకు 2,275 మంది, 2,533 మంది బాలికలకు 1,643 మంది పాసయ్యారు. రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు ఈనెల 19వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాలు ఇలా..

ఓపెన్ స్కూల్ టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 581 మంది విద్యార్థులు హాజరవగా 220 మంది పాసయ్యారు. ఇంటర్మీడియట్‌లో 2116 మంది పరీక్షలు రాయగా, 926 మంది ఉత్తీర్ణత సాధించారు.

రేపు సచివాలయాల ప్రాంగణాల్లో 'మెగా యోగా'

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల ప్రాంగణాల్లో శనివారం 'మెగా యోగా' నిర్వహించాలని డీఆర్వో మోహన్ కుమార్ తెలిపారు. యోగా ఏర్పాట్లపై గురువారం ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో 8.60లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. శనివారం అన్ని గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల ఆవరణల్లో ఉదయం సమయంలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులతో యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు



జీవో ప్రతులు చూపుతున్న టీచర్లు

ఎస్జీటీల బదిలీల్లో గందరగోళం

- జీవో ప్రకారం బదిలీలు నిర్వహించాలన్న యూనియన్లు
- నిబంధనలకు లోబడే నిర్వహిస్తున్నామన్న అధికారులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ రోజుకో మలుపు తిరుగుతోంది.స్పౌజ్ కేసుల్లో జీవో ప్రకారం బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు, టీచర్లు పట్టుపడుతుండగా నిబంధనల ప్రకారమే చేస్తున్నామంటూ విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. చిత్తూరు షర్మన్ మెమోరియల్ స్కూల్లో మంగళవారం డీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో మొదలైన ఎస్జీటీల మ్యాన్యువల్ కౌన్సెలింగ్‌లో దాదాపు 800మందికి పైగా బదిలీ అయ్యారు.వరుస సంఖ్య 703లోని ఎస్జీటీతో స్పౌజ్ పాయింట్స్ వినియోగంపై మొదలైన సమస్య పెద్దదైంది.గురువారం ఉదయం 11 గంటలకు 501 వరుస సంఖ్య నుంచి సాఫీగా మొదలైన బదిలీ కౌన్సెలింగ్ సాయంత్రానికి వేడెక్కింది.జీవో ప్రకారం కౌన్సెలింగ్ చేపట్టాలి, కంపల్సరీ స్పౌజ్ అభ్యర్థులకు న్యాయం చేయాలి అంటూ 5 గంటలకు ఎస్జీటీలు నిరసనకు దిగారు.భార్యాభర్తలు ఒకే ప్రాంతంలో 8 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుంటే ఖచ్చితమైన బదిలీ కిందికి వస్తారు. పాయింట్ల ఆధారంగా మొదట వచ్చే భర్త/భార్య జిల్లాలో ఏ ప్రాంతానికైనా బదిలీ కోరుకునే వెసులుబాటు ఉంది. తదుపరి వచ్చే టీచర్ భర్త/భార్య కోరుకున్న సమీప ప్రాంతానికి వెళ్లాల్సి ఉందని అధికారులు చెప్పారు.అయితే ఇద్దరూ తలోవైపు వెళతామంటూ పట్టుబడుతుండడంతోనే దుమారం రేగుతోందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఎస్జీటీల ఆందోళన సమాచారంతో డీఆర్వో మోహన్ కుమార్ కౌన్సెలింగ్ సెంటర్‌కు చేరుకుని డీఈవో వరలక్ష్మితో పాటు ఆర్జేడీ శామ్యూల్‌తో ఫోన్‌లో చర్చించారు. బదిలీ జీవోలో వెసులుబాటు ఉన్నంత వరకు న్యాయం చేస్తామని ఎస్జీటీలకు హామీ ఇచ్చాక 6.30 గంటలకు కౌన్సెలింగ్ మళ్లీ మొదలై రాత్రి 12 గంటల వరకు కొనసాగింది.

నేటి బదిలీ షెడ్యూల్

శుక్రవారం ఉదయం 8.30 గంటలకు సీరియల్ నంబరు 1001 నుంచి మొదలై 1500 వరకు సాగుతుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు సీరియల్ నంబరు 1501తో మొదలుపెట్టి 2000 వరకు బదిలీలు నిర్వహిస్తామని డీఈవో వరలక్ష్మి తెలిపారు.

మామిడికి మద్దతు ధర అమలులో

ఆటంకాలు

రూ.8 ఇచ్చేందుకు ముందుకు రాని ఫ్యాక్టరీలు

పరిధికి మించి కల్పించుకోలేకపోతున్న అధికారులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి):తోతాపురి మామిడి కాయలకు మద్దతు ధర అమలులో అధికార యంత్రాంగానికి గుజ్జు పరిశ్రమల నుంచి సహకారం అందడం లేదు. మామిడి రైతులను ఆదుకునేందుకు తోతాపురికి మద్దతు ధర రూ.12 ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం అందులో రూ.4 సబ్సిడీపై ఇస్తామని చెప్పడంతో రైతులు ఆనందపడ్డారు.అయితే తమిళనాడు, కర్ణాటకల నుంచి కాయలు రూ.4కే దొరుకుతుండడంతో గుజ్జు పరిశ్రమలు అటు మొగ్గు చూపాయి. దీంతో కలెక్టర్ సుమిత్ కుమార్ సమావేశాలు నిర్వహించి సహకరించమని కోరినా నష్టానికి వ్యాపారాలు చేయలేమని గుజ్జు ఫ్యాక్టరీ యాజమాన్యాలు చేతులెత్తేశాయి.ప్రభుత్వం ఇచ్చే రూ.4 సబ్సిడీ కోసం తాము రూ.4 నష్టపోలేమని చెబుతున్నాయి. చివరకు కిలోకు రూ.5మంచి చెల్లించలేమని స్పష్టం చేశాయి. అధికారులు వత్తిడి తెచ్చి పరిశ్రమల్లో నిర్ణయించిన ధరకు కాయలు కొనాలంటూ ఆదేశాలు జారీ చేసినా పలు గుజ్జు పరిశ్రమలు ఒప్పుకోవడం లేదు.ఓ పరిశ్రమ యాజమాన్యమైతే మద్దతు ధర అమలు చేయించేందుకు తమ ఫ్యాక్టరీ ఆవరణలోకి ప్రభుత్వ అధికారులు రావడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.ఫ్యాక్టరీలో దొంగతనం, ఆస్తి నష్టం జరిగితే అందుకు ప్రభుత్వ సిబ్బందిని బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. గతేడాది మార్కెట్ లేకపోవడంతో గుజ్జు పరిశ్రమల్లో దాదాపు 2.50 లక్షల టన్నుల పల్ప్ నిలిచిపోయింది.సగం ధరకు 75 వేల టన్నులు విక్రయించగా 50 వేల టన్నుల పల్ప్ పాడైపోయింది.మిగిలిన మొత్తం 1.25 లక్షల పల్ప్ నిల్వలు ఇంకా ఫ్యాక్టరీల్లోనే ఉండడంతో పెద్దమొత్తంలో కాయల్ని కొనలేకపోతున్నామని గుజ్జు పరిశ్రమదారులు చెబుతుండడంతో అధికారులు కూడా ఒక దశ దాటి గుజ్జు పరిశ్రమలపై వత్తిడి తేలేక పోతున్నారు.గుజ్జు పరిశ్రమల వద్దకు వచ్చిన కాయల్లో నాణ్యత లేకపోయినా కొనిపించేలా అధికారులపై కొందరు రైతులు వత్తిడి తేవడం, నాణ్యత లేని కాయలకు అంత ధర ఇవ్వలేమని గుజ్జు పరిశ్రమలు చెప్పడం...క్షేత్రస్థాయిలో అనేక సమస్యలతో అధికార యంత్రాంగం సైతం నీరసించిపోయింది.

పాఠశాలలు పునఃప్రారంభం





చిత్తూరులో స్కూల్లో అడుగుపెడుతున్న విద్యార్థులు - పుంగనూరులో విద్యామిత్ర కిట్ అందుకుంటున్న విద్యార్థిని

చిత్తూరు సెంట్రల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. సెలవుల్లో ఆటలాడుతూ గడిపిన చిన్నారులు బడిలోని కొత్త తరగతుల్లో ఉత్సాహంగా అడుగుపెట్టారు. ప్రభుత్వం అందజేసిన స్టూడెంట్ కిట్‌లో కొత్త బ్యాగు, జామెంట్రీబాక్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూలు చూసుకుని సంబరపడ్డారు. ఉపాధ్యాయులు పరిచయ కార్యక్రమాలు నిర్వహించారు.సన్నబియ్యంతో మధ్యాహ్నభోజనం వడ్డించారు. జిల్లావ్యాప్తంగా 70 శాతం మంది విద్యార్థులు బడులకు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.బైరెడ్డిపల్లె మండలం మూగనపల్లె ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను నాచుకుప్పం పాఠశాలలో విలీనం చేయవద్దని గ్రామస్తులు నిరసన తెలిపారు.అలాగే పుంగనూరు మండలంలోని మార్లపల్లె ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5తరగతుల విద్యార్థులను సింగిరిగుంటకు వెళ్లాలని టీచర్ చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల గేట్లకు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. గోపిశెట్టిపల్లె పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను మేలుదొడ్డి పాఠశాలకు వెళ్లాలని చెప్పడంతో కూడా తల్లిదండ్రులు నిరసన తెలిపారు.

అమ్మను వేధిస్తున్నాడని నాన్నను చంపేశాడు





తండ్రీకొడుకులు వెంకటరెడ్డి - సోమశేఖర రెడ్డి

చిత్తూరు అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి భార్యను తరచూ వేధించడంతో పాటు కుటుంబ సభ్యులను మానసిక క్షోభకు గురిచేస్తున్న తండ్రిని ఆయన కుమారుడే నరికి చంపాడు. తల్లిని చంపడానికి కత్తితో దాడి చేసే ప్రయత్నం చేస్తుంటే అదే కత్తిని తీసుకుని తండ్రిని హతమార్చాడు.చిత్తూరు టూ టౌన్ ఇన్‌చార్జి సీఐ మహేశ్వర కథనం మేరకు... చిత్తూరు నగరం తేనబండ రోడ్డులో ఉన్న లెనిన్‌నగర్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేసే వెంకటరెడ్డి(54) కుటుంబంతో నివాసముంటున్నాడు. భార్య సరస్వతిపై అనుమానంతో తరచూ మద్యం సేవించి ఘర్షణ పడుతుండేవాడు.పుట్టింటి నుంచీ డబ్బులు తీసుకురావాలంటూ వేధించేవాడు. గురువారం కూడా సరస్వతితో ఘర్షణ పడ్డ వెంకటరెడ్డి కత్తితో నరకడానికి ప్రయత్నించాడు.ఎక్కడ తల్లిని చంపేస్తాడేమోననే భయంతో రెండో కుమారుడు సోమశేఖర రెడ్డి అదే కత్తి లాక్కుని తండ్రి మెడపై నరికాడు. దీంతో వెంకటరెడ్డి అక్కడికక్కడే మరణించడం చూసి పరారయ్యాడు. డీఎస్పీ సాయినాథ్, సీఐ మహేశ్వర సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.వెంకటరెడ్డి భార్య సరస్వతమ్మ ఫిర్యాదు మేరకు సోమశేఖర రెడ్డిపై కేసు నమోదు చేశారు.



గజ వాహనంపై ప్రసన్నుడు

వడమాలపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం అప్పలాయగుంటలో ప్రసన్నవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం హనుమంత, రాత్రి గజ వాహనంపై ఉత్సవర్లు ఊరేగారు. ఉదయం నిత్యకైంకర్యాలు ముగిశాక. కోదండ రాముడి అలంకారంలో స్వామివారు హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం పద్మావతి, ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వరుడికి నూతన పట్టువస్త్రాలు ధరింపచేసి వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఉభయ దేవేరులతో పాటు దేవదేవుడిపై అర్చకులు పసుపు నీళ్ల చల్లుతూ గోవింద నామాలు పఠించారు. రాత్రి గజ వాహనంపై ప్రసన్న వెంకటేశ్వరుడు మాడవీధుల్లో ఊరేగారు. డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, కంకణభట్టార్ తిప్పయ్యఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.



హనుమంతు వాహనంపై స్వామివారు - గజవాహనం అధిరోహించిన వెంకటేశ్వరుడు

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,296
తలనీలాలు సమర్పించినవారు: 33,511



గంగమ్మకే శఠగోపం!

- ఫేక్ ఉత్తర్వులతో ప్రమోషన్లు
- వైసీపీ హయాంలో జరిగిన నకిలీ కథ
- ఐదుగురిపై సస్పెన్షన్ వేటు, క్రిమినల్ కేసు
- బలిపశువులుగా భజంత్రీలు
- పరారీలో కంప్యూటర్ ఆపరేటర్

తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో భజంత్రీలుగా పనిచేస్తున్న ఐదుగురు సిబ్బందిని వైసీపీ అధికారంలోని కొందరి చర్య వలన బలిపశువులగా మారారు. దేవదాయశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయంటూ పదోన్నతి కల్పించేసి వారి కళ్లల్లో నింపిన ఆనందాన్ని మూన్నాళ్ల ముచ్చటగా మార్చారు. కమిషనర్ పేరిట వచ్చిన పదోన్నతి ఉత్తర్వులు ఫేక్ అని తేలడంతో ఐదుగురిపై సస్పెన్షన్ వేటు పడింది. క్రిమినల్ కేసూ నమోదైంది.

- తిరుపతి ఆంధ్రజ్యోతి

ఉమ్మడి ఏపీలో దేవదాయ, ధర్మదాయ శాఖ పరిధిలోని ప్రధాన ఆలయాల్లో భజంత్రీలు (వాయిద్యకారులను) నియమించాలని 2008లో అప్పటి ప్రభుత్వం భావించింది. ఈక్రమంలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి 9 మందిని భజంత్రీలు పేరిట నియమించారు. కొంతకాలానికి టైం స్కేల్ ఇచ్చారు. 15 ఏళ్లకు పైగా పనిచేస్తున్నామని, తమను గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 సిబ్బందిగా పదోన్నతి కల్పించాలని పలు సార్లు రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇస్తూ వచ్చారు. ఈక్రమంలో కొందరు హామీలు కూడా ఇచ్చారు. ఈ క్రమంలో భజంత్రీలు జి.శివకుమార్ (నాదస్వరం), పి.వెంకటసుబ్బయ్య (డోలు), ఆర్.జయరాం (డోలు) 2022 డిసెంబరు 30న గ్రేడ్1గా పదోన్నతి పొందినట్టు కమిషనరు కార్యాలయం ఉత్తర్వు గంగమ్మ ఆలయ కార్యాలయంలో ప్రత్యక్షమైంది. అప్పుడు ఈవోగా ఉన్న మునికృష్ణయ్య 2023 జనవరి 1న గ్రేడ్-2 కేడర్ కింద విధులు నిర్వహిస్తున్న వీరికి గ్రేడ్-1గా పదోన్నతి ఇచ్చేశారు. అనారోగ్య కారణాలతో 2023 అక్టోబరు 1న ఈవో మునికృష్ణయ్య విధుల్లో ఉండగానే మృతిచెందారు. తమతో పాటు పనిచేసిన ముగ్గురికి పదోన్నతి రావడంతో మరికొంతమంది ప్రయత్నించారు. మునికృష్ణయ్య మృతి తర్వాత ఈవోగా వచ్చిన మమత టేబుల్‌పై దేవదాయ శాఖ కమిషనర్ నుంచి వచ్చినట్టు మరో ఉత్తర్వు కనిపించింది. భజంత్రీగా ఉన్న పి.అయ్యప్పను రికార్డు అసిస్టెంట్‌గా, పి.రెడ్డెమ్మ (నాదస్వరం)ను గ్రేడ్-1గా పదోన్నతి ఇస్తున్నట్టు సదరు ఉత్తర్వులో ఉంది. అయితే ఈవో ఉత్తరు కాపీని ముందు, వెనుక చూడకుండా ముందు ఈవో ఇచ్చారు కదా అని వీరికీ పదోన్నతి ఇచ్చేశారు.

ఫేక్ అని బయట పడిందిలా..

'భజంత్రీని రికార్డు అసిస్టెంట్‌గా ఎలా ఇస్తారని? దీనిపై విచారించి చర్యలు తీసుకోకపోతే ఆలయం వద్ద ఆందోళన చేస్తాం' అనే సారాంశంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో దేవదాయశాఖ ఆర్జేసీకి ఎవరో వాట్సప్‌లో మెసేజీ పంపారు. తనకు వచ్చిన మెసేజీని ఏప్రిల్ 23న గంగమ్మ ఆలయ ఈవో జయకుమార్‌కు పంపి.. సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆర్జేసీ ఆదేశించారు. దీనిపై ఈవో విచారణ చేపట్టారు. కార్యాలయంలో ఉన్న ఉత్తర్వులు.. కమిషనర్ కార్యాలయంలో లేకపోవడం, కేవలం వాట్సప్, మెయిల్లో ఉత్తర్వులు వచ్చినట్టు ఉండడం, వాటి ఆధారంగా అప్పటి ఆలయ ఈవోలు మునికృష్ణయ్య, మమత వీరికి పదోన్నతలు ఇచ్చినట్టు నిర్ధారణ అయింది. ఆ మేరకు ఆయన ఉన్నతాధికారులకు నివేదక పంపారు. దీంతో ఐదుగురు భజంత్రీలను సస్పెండ్ చేసి పోలీసు కేసు పెట్టాలని అధికారులు ఆదేశించారు. కంప్యూటర్ ఆపరేటర్ పి.సి.నవీన్ కృష్ణ కుమార్ మెయిల్లో ఉత్తర్వులు వచ్చాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది వెలుగులోకి వచ్చిన వెంటనే ఆపరేటర్ నవీన్ పరారీలో ఉన్నాడు. అతడిని విచారిస్తే తప్ప అసలు విషయాలు బయటకు వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. కాగా నకిలీ ఉత్తర్వుల వెనుక తమకెలాంటి ప్రమేయం లేదని భజంత్రీలు వాపోతున్నారు. పదోన్నతలు వచ్చాయని అధికారులు చెబితేనే తమకు తెలిసిందని విలపిస్తున్నారు.



మోగింది బడి గంట

- మొదటి రోజు 20 శాతం మందే హాజరు
- పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు, కిట్లు



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీ శంకర్రావు, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ జి. సురేష్.

తిరుపతి(విద్య), జూన్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు మాత్రం అతితక్కువగానే పాఠశాలలకు హాజరయ్యారు. సుమారు 3 లక్షల మంది విద్యార్థులు తరగతులకు హాజరు కావాల్సి ఉండగా కేవలం 20 శాతం మాత్రమే వచ్చినట్టు విద్యాశాఖాధికారులు వెల్లడించారు. పాఠశాలలు పునః ప్రారంభమైన తర్వాత రోజుల్లోనే రెండో శనివారం, ఆదివారం ఉండటంతో విద్యార్థులు పెద్దగా రాలేదు. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో బడిబాట పడతారని అంచనా వేస్తున్నారు. తొలిరోజు వచ్చిన విద్యార్థులకు యూనిఫాం క్లాత్, పాఠ్య.. నోటుపుస్తకాలు, డిక్షనరీలను సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. గౌరీ శంకర్రావు, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ జి. సురేష్ పంపిణీ చేశారు. కాగా, ఎన్నడూ లేనివిధంగా పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజునే విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామిగ్రి అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లను అధికారులు పాఠశాలలకు చేర్చారు. స్టూడెంట్ కిట్‌లో బ్యాగ్, మూడు జతల యూనిఫాం క్లాత్, బూట్లు, రెండు జతల సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీ, బెల్టు ఉంటాయి. నోట్‌బుక్స్, బ్యాగ్‌లు, బెల్టులు, డిక్షనరీలు పూర్తిస్థాయిలో పాఠశాలలకు చేరాయి. యూనిఫారం, బూట్లు మాత్రం కొంతమేరకు ఇంకా సరఫరా కావాల్సి ఉంది.



తిరుపతిలోని ఎంజీఎం స్కూల్ వద్ద విద్యార్థులు

పాఠశాలలకు చేరిన కిట్లు ఇలా

	కావాల్సినవి	చేరినవి	చేరాల్సినవి
నోట్‌బుక్స్	812148	812148	0
బ్యాగ్స్	143330	143330	0
యూనిఫాం	143330	96448	46842
బూట్లు	145464	65595	79869
బెల్టులు	103382	103382	0
డిక్షనరీలు	12550	12550	0

పాఠశాలల వర్గీకరణ:

ఇదివరకు రాష్ట్రంలో మొత్తం 6 రకాల పాఠశాలలు ఉండేవి. కూటమి ప్రభుత్వం దీనిని 9గా విభజించింది. ఆమేరకు పాఠశాలలు, విద్యార్థుల వివరాలివీ

- జిల్లాలో 2,264 ప్రభుత్వ పాఠశాలల్లో 1,42,356 మంది చదువుతున్నారు. , ఫౌండేషనల్ స్కూల్స్ : 1,054
  బేసిక్ ప్రైమరీ స్కూల్స్ : 301
  మోడల్ ప్రైమరీ స్కూల్స్ : 613
  అప్పర్ ప్రైమరీ స్కూల్స్ : 8
  హైస్కూల్స్, హైస్కూల్ ప్లస్‌లు : 262 , ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు : 26
- 803 ప్రైవేటు పాఠశాలల్లో 1,55,784 మంది విద్యార్థులున్నారు.
  ప్రీ ప్రైమరీ : 250 పాఠశాలలు
  అప్పర్ ప్రైమరీ : 138
  సెకండరీ : 290
  హైస్కూల్స్ : 123
  ప్రైవేట్ ఎయిడెడ్ : 2



హాజరు నమోదుకు ఉపాధ్యాయుల కుస్తీ

ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ రూ. 600

పాఠశాలల వర్గీకరణ నేపథ్యంలో జిల్లాలో కొన్ని పాఠశాలలు దగ్గరి ప్రాంతాల్లోని ఇతర పాఠశాలల్లో విలీనమయ్యాయి. దీంతో ఆ ప్రాంతం నుంచి విద్యార్థులు మరో ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చింది. ఈ విద్యార్థులను వదిలేయకుండా ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్ చార్జిలు చెల్లించి మరీ బడి బాట పట్టిస్తోంది. గతంతో పోలిస్తే ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని మెర్జ్ చేసిన పాఠశాలలకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ రవాణా భత్యం కింద రూ.600 చెల్లిస్తోంది. ఇలా రవాణా భత్యం చెల్లించాల్సిన విద్యార్థులు జిల్లాలో 11,500 మంది ఉన్నట్టు తెలుస్తోంది.

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేయండి

- అకడమిక్ క్యాలెండర్‌ను విధిగా పాటించాలి
- పిల్లలతో యోగా చేయించాలన్న డీఈవో

తిరుపతి(విద్య), జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా ఈనెల 21 వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేయాలని డీఈవో కేవీఎన్ కుమార్ ఉపాధ్యాయులను గురువారం ఆదేశించారు. పాఠశాలల్లో చేరికలను 100 శాతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వర్గీకరించిన ప్రకారమే విద్యార్థులను తరగతుల్లో కూర్చోబెట్టాలని సూచించారు. విద్యార్థులకు జారీ చేసిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులు కొత్తగా వెళ్లిన పాఠశాలలకు అందించాలన్నారు. అకడమిక్ క్యాలెండరును తప్పనిసరిగా అనుసరించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, శుభ్రతతో వడ్డించాలన్నారు. సన్న బియ్యంతోనే వండాలని, పాత బియ్యం స్టాక్ ఉంటే వాటిని వాడొద్దని సూచించారు. విద్యార్థులందరిచేత యోగాచేయించాలని, తరగతుల వారీగా యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలని చెప్పారు. లీప్ యాప్‌లో ఉపాధ్యాయులందరూ ఫేసియల్ అటెండన్స్ వేయాలన్నారు.



డీఈఓ కేవీఎన్ కుమార్

- ఘాట్‌రోడ్లలో మరమ్మతులు

నెమ్మదిగా వెళ్లండి!

వాహనదారులకు టీటీడీ హెచ్చరికలు

తిరుమల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతి ఘాట్‌రోడ్లలో మరమ్మతులు జరుగుతున్నాయని, వాహనదారులు అప్రమత్తంగా వాహనాలను నడపాలని టీటీడీ గురువారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించింది.ఘాట్‌రోడ్లను మూసివేయకుండానే మరమ్మత్తు పనులను త్వరితంగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపింది. వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాలని, చేరాల్సిన సమయం కన్నా గంట ముందుగా బయలుదేరాలని సూచనలు చేసింది. అత్యవసర సేవలకు టీటీడీ టోల్‌ఫ్రీ 155257ను సంప్రదించాలని పేర్కొంది.

పీజీ సెట్‌కు 86 శాతం హాజరు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వర్సిటీల్లో పీజీ ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలకు 86 శాతం విద్యార్థులు హాజరయ్యారు. 25,688 మంది దరఖాస్తు చేసుకోగా, 22 వేల మంది పరీక్ష రాశారు.ఫలితాలను ఈనెల 25న విడుదల చేయనున్నట్లు కన్వీనర్ పీసీ వేంకటేశ్వర్లు, కో-కన్వీనర్ కె.సురేంద్రబాబు తెలిపారు.

ఆర్టీసీ దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ జిల్లా పరిధిలో 79 వాణిజ్య దుకాణాలకు టెంటర్లు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీవో వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు పని వేళల్లో ఆయా డిపోల మేనేజర్ కార్యాలయాల్లో దరఖాస్తులు ఇవ్వాలని పేర్కొన్నారు. తిరుపతి సీబీఎస్‌లోని శ్రీహరి బస్టాండులో 16, శ్రీనివాసం బస్టాండులో 7, కమర్షియల్ కాంప్లెక్స్‌లో 4, ఏడుకొండల బస్టాండులో 2. రేణిగుంట 1, పాకాల 9, భాకరాపేట 4, శ్రీకాళహస్తి 9, ఏర్పేడు 1, పుత్తూరు 2, బాలాయపల్లి 1, వెంకటగిరి 2, వాకాడు 11, సూళ్లూరుపేట 2, నాయుడుపేట 2, తడ1, చిల్లకూరు 2, గూడూరు 2, ఓజిలి 1 ఉన్నాయి.

పీసీసీ చీఫ్ షర్మిల పర్యటన వాయిదా

తిరుపతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో శుక్రవారం జరగాల్సిన పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పర్యటన వాయిదా పడింది. అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం కారణంగా ఆమె పర్యటనను వాయిదా వేసుకున్నారు. ముందుగా నిర్ణయించిన మేరకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు శ్రీకాళహస్తిలో జరిగే జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం.. కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొనాల్సి వుంది. కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేసుకున్నారు. గురువారం మధ్యాహ్నం జరిగిన విమాన ప్రమాదంతో ఈ సమావేశాలను వాయిదా వేసుకున్నారు.

78 పరిశ్రమలకు సేఫ్టీ అధికారులు


నియామకానికి ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ

తిరుపతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కార్మికులకు ప్రమాదాలు, అనారోగ్యం సంభవించే అవకాశాలున్న 78 పరిశ్రమలలో సేఫ్టీ అధికారులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వెయ్యి మందికి మించి వర్కర్లు పనిచేస్తున్న పరిశ్రమల్లోనూ, అలాగే 250 మందికి మించి వర్కర్లు పనిచేస్తున్న ప్రమాదకర పరిశ్రమల్లోనూ సేఫ్టీ అధికారుల నియామకానికి గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది.

కామాంధుడి అరెస్టు

పిచ్చాటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలంలో 15 ఏళ్ల బాలికను మాయ మాటలతో మభ్యపెట్టి అత్యాచారానికి పాల్పడిన కామాంధుడు శేఖర్(55)ను అరెస్టు చేసినట్లు సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. గత నెలలో జరిగిన ఈ ఘటనపై తన తల్లికి బాలిక వివరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో. రేప్ కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

టీటీడీ ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షలు



అదనపు ఈవోకు చెక్కు అందజేస్తున్న లోకేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి

తిరుమల/నాయుడుపేట, జూన్12(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. నాయుడుపేటకు చెందిన పోతిరెడ్డి లోకేష్ రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి ఈ విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. వారి వెంట వై.రాఘవేంద్ర ఉన్నారు.



ఏటీఎం గదిలో నాగుపాము

తిరుమల, జూన్12(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఎస్వీ మ్యూజియం సమీపంలోని ఓ ఏటీఎం గదిలోకి నాలుగు అడుగుల నాగుపాము ప్రవేశించింది. అక్కడి సిబ్బంది గుర్తించి బయటకు పరుగు తీశారు. వీరి సమాచారంతో పాములు పట్టే టీటీడీ ఉద్యోగి భాస్కర్‌నాయుడు చేరుకుని పామును పట్టుకున్నాడు. వాసవి భవనంలోని స్టోర్‌లో కూడా సుమారు ఐదు అడుగుల పొడవైన జెర్రిపోతు పాము చొరబడింది. దీనిని కూడా ఆయన చాకచక్యంగా పట్టుకున్నారు. ఈరెండు పాములను అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

హత్యాయత్నం కేసులో నిందితురాలి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం జరిగిన హత్యాయత్నం ఘటనలో నిందితురాలిని గురువారం అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన గీత, ఆమె కుమారుడు హేమకుమార్ జనవరిలో నెల్లూరుకు చెందిన కుమారికి ఎంబ్రాయడరీ మిషన్‌ను రూ.4 లక్షలకు విక్రయించి డబ్బు తీసుకున్నారు. నెలలు గడచినా ఎంబ్రాయడరీ మిషన్ ఇవ్వలేదు. దీంతో పలుసార్లు గీతను అడిగారు. ఈ క్రమంలో రూ3.40 లక్షలు తిరిగి ఇచ్చేశారు. మిగిలిన రూ 60 వేలు మాత్రం ఇవ్వకుండా తిప్పుకొంటున్నారు. దీంతో గీత ఇంటికి కుమారి వచ్చి డబ్బుల విషయమై గొడవ పడ్డారు. అదే సమయంలో హేమకుమార్ బయటకు వచ్చి కుమారితో మాట్లాడుతుండగా.. ఆమె తన వెంట తెచ్చుకున్న పెట్రోలును తల్లీ కొడుకుపైన పోసి లైటర్ వెలిగించారు. అక్కడ్నుంచి తప్పించుకుని పరారయ్యారు. గీత, హేమకుమార్‌ను మంటల నుంచి స్థానికులు కాపాడి రుయాలో చేర్పించారు. జరిగిన ఘటనపై అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితురాలు కుమారిని లెప్రసీ ఆస్పత్రి వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు

నలుగురు ఇరిగేషన్ డీఈలకు పదోన్నతి

తిరుపతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలవనరుల శాఖలో డీఈలుగా పనిచేస్తున్న నలుగురికి ఈఈలుగా తాత్కాలిక పదోన్నతి లభించింది. పదోన్నతిపై వారిని వేర్వేరు చోట్లకు ప్రభుత్వం బదిలీ చేసింది. తెలుగుగంగ ప్రాజెక్టు నాయుడుపేట సబ్ డివిజన్‌లో డీఈగా పనిచేస్తున్న వి.గజేంద్రరెడ్డి ఈఈగా పదోన్నతిపై నెల్లూరు 2వ ఎస్‌టీ డివిజన్‌కు బదిలీ అయ్యారు. తెలుగు గంగ ప్రాజెక్టు శ్రీకాళహస్తి క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ డీఈ ఎస్.వేణు గోపాల్ ఈఈగా నంద్యాల ఎస్‌ఆర్‌బీసీ రెండవ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీరుగా బదిలీ అయ్యారు. కడప హైడ్రాలజీ డివిజన్ పరిధిలో తిరుపతి సబ్ డివిజన్‌కు డీఈగా వున్న టి.సురేంద్ర రెడ్డి ఈఈగా పదోన్నతి మీద కడప జిల్లా పులివెందుల జీఎన్ఎ్ఎస్ 7వ డివిజన్‌కు బదిలీ అయ్యారు. తెలుగుగంగ ప్రాజెక్టు శ్రీకాళహస్తి 3వ సబ్ డివిజన్‌లో డీఈగా పనిచేస్తున్న పి.చిన్మయలింగం ఈఈగా పదోన్నతిపై కడప కన్‌స్ట్రక్షన్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీరుగా బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 11 మంది డీఈలకు పదోన్నతులు లభించగా వారిలో నలుగురు జిల్లాకు చెందిన వారు. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆగస్టు 15 నుంచి మహిళలకు

ఉచిత బస్సు ప్రయాణం



తిరుమల, జూన్12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలు ఎదురుచూస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి మొదలవుతుందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా 'తల్లికి వందనం' కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తున్నారన్నారు. శ్రీవారి ఆశీస్సులు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా రైతులకు ఉండాలని ప్రార్థించానన్నారు.



జాతీయ స్మారకాలుగా గొట్టిప్రోలు, చింతకుంట!

- కేంద్రం చర్యలు చేపట్టిందన్న డాక్టర్ వీరాంజనేయులు

నాయుడుపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలంలోని గొట్టిప్రోలు, కడప జిల్లాలోని చింతకుంటను జాతీయ స్మారకాలుగా గుర్తించేందుకు కేంద్ర సాంస్కృతిక, పురావస్తు శాఖ చర్యలు చేపట్టిందని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చింతకుంట, గొట్టిప్రోలును జాతీయ స్మారకాలుగా గుర్తించాలని ఈ మేరకు ఏప్రిల్ 30వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశామన్నారు. ప్రధానమంత్రి కార్యాలయ సూచన మేరకు కేంద్ర సాంస్కృతిక, పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ బాడీజర్ కడప జిల్లాలోని చింతకుంట ప్రాచీన రాతిచిత్రాలు, తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం గొట్టిప్రోలులో ఉన్న పురాతన సంపదను జాతీయ స్మారకాలుగా గుర్తించేందుకు చర్యలు ప్రారంభించారన్నారు. చింతకుంటలోని ఆదిమానవుల శిలా రేఖాచిత్రాలకు, గొట్టిప్రోలు కోటదిబ్బకు ఘన చరిత్ర ఉందని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు పేర్కొన్నారు.



గొట్టిప్రోలులో పురావస్తుశాఖ తవ్వకాలలో బయటపడ్డ విగ్రహం, కోటదిబ్బ

విమాన ప్రమాదం హృదయ విదారక ఘటన
రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం,జూన్12(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం హృదయ విదారక ఘటన అని రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదమన్నారు. పైగా ఈ విమానం మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కూలడంతో మెడికోలు కూడా ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన వారందరికీ బాధాతప్త హృదయంతో నివాళి అర్పిస్తున్నానని, వారి కుటుంబాలకు మనోధైర్యాన్ని ఇవ్వాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు థామస్ ప్రకటించారు.

లైసెన్స్ లేకుండా ర్యాంపులు నిర్వహిస్తే చర్యలు
మార్కెటింగ్ శాఖ ఏడీ హెచ్చరిక

చిత్తూరు సెంట్రల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇకపై లైసెన్స్ లేకుండా ర్యాంపులు నిర్వహించే వారిపై చర్యలు తప్పవని మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్ హెచ్చరించారు. జిల్లాలో ర్యాంపుల ద్వారా మామిడి క్రయ విక్రయాల అధికారాలను మార్కెటింగ్ శాఖకు అప్పగిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆ శాఖ అధికారులు గురువారం నుంచి జిల్లాలో ఇప్పటి వరకు గుర్తించిన 39 ర్యాంపు నిర్వాహకులకు లైసెన్స్‌లు ఇస్తున్నారు. అనధికారికంగా నిర్వహిస్తున్న ర్యాంపులు ఇకపై అధికారికం కానున్నాయి. ర్యాంపుదారులు రోజువారీగా రైతులనుంచి కొనుగోలు చేసే మామిడి కాయలకు సంబంధించి రికార్డులు నిర్వహించాలి. రసీదులు రైతులకు అందజేయాలి. ఆ రసీదు ఆధారంగా రైతులకు సబ్సిడీ మొత్తం కోసం ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వానికి అధికారులు నివేదించనున్నారు.

17లోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలు పూర్తి చేయాలి
వైద్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్

చిత్తూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్య శాఖలో ఈనెల 17వ తేదీలోపు అన్ని క్యాడర్ల బదిలీలు పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో సుధారాణిని రాష్ట్ర వైద్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బదిలీల్లో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. ఎక్కడా ఏ పొరపాట్లకు తావు లేకుండా బదిలీ ప్రక్రియను, ఎన్సీడీ సర్వే లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం కావడంతో మలేరియా విభాగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హాస్టళ్లను తనిఖీలు చేయడంతోపాటు గ్రామాల్లో ట్యాంకులు, పరిసరాలు శుభ్రంగా ఉన్నాయా లేవా అని పరిశీలించాలని ఆదేశాలిచ్చారు.

డబ్బులిస్తే వైద్యశాఖలో ఉద్యోగమిప్పిస్తా!

- 90628 23086 నెంబరు నుంచి వ్యక్తి ఫోన్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన డీఎంహెచ్‌వో

చిత్తూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తనకు డబ్బులిస్తే వైద్యశాఖలో ఉద్యోగమిప్పిస్తానంటూ రెండ్రోజులుగా 90628 23086 నెంబరు నుంచి ఓ వ్యక్తి పలువురికి ఫోన్ చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుధారాణి దృష్టికి వచ్చింది. ఆమె ఈ విషయమై చిత్తూరు టూటౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఇటీవల కాలంలో ఎటువంటి నోటిఫికేషన్ విడుదల కాలేదు. అయితే ఓ వ్యక్తి గత నోటిఫికేషన్లలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను సంపాదించాడు. అందులోని వారికి ఫోన్లు చేస్తూ డబ్బులు పంపితే ఉద్యోగమిప్పిస్తానని, అపాయింట్‌మెంట్ ఆర్డర్ పంపుతానని చెబుతున్నాడు. ఈ విషయమై పలువురు డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో ప్రస్తుతం తమ శాఖలో ఎటువంటి నోటిఫికేషన్లు విడుదల చేయలేదని చెప్పారు. ఒకవేళ విడుదలైనా మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు ఇస్తారని ఎటువంటి అక్రమాలు జరిగే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇలా ఫోన్లు చేసేవారిని ఆశ్రయించి, మోసపోవద్దని సూచించారు.

సన్న బియ్యం పక్కదారి పట్టకుండా క్యూఆర్ కోడ్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, వసతి గృహాలకు మధ్యాహ్న భోజనం పథకం కోసం ఉద్దేశించిన సన్న బియ్యం పక్కదారి పట్టకుండా ప్రతి బస్తాపై క్యూఆర్ కోడ్ ఉంటుందని జేసీ విద్యాధరి తెలిపారు. ఎంఎల్ పాయింట్ నుంచి బియ్యం బస్తాలు వచ్చాయా లేదా అన్నది డిజిటల్ ట్రాకింగ్ ద్వారా గుర్తించవచ్చన్నారు. ప్రభుత్వ సూచనలతో సన్నరకం ఫైన్ వెరైటీ బియ్యం 25 కిలోల బస్తాలుగా ముందస్తుగా సరఫరా చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని 2,134 పాఠశాలల్లోని 2,12,427 మంది విద్యార్థులకు 9846 బస్తాలు, అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థ ద్వారా కొనసాగుతున్న పాఠశాలల్లో చదివే 25,500 మంది విద్యార్థులకు 2,097 బస్తాలు, 106 వసతిగృహాల్లో ఉంటున్న 12,452 మంది కోసం 4,426 బస్తాల బియ్యం ఇదివరకే జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారుల ద్వారా ఎంఎల్ పాయింట్ల నుంచి తరలించినట్లు జేసీ వివరించారు.

చెరువులో గల్లంతైన యువకుడి మృతి


శ్రీనివాసులు రెడ్డి (ఫైల్ ఫొటో)

గంగవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం వెలికితీశారు. బైరెడ్డిపల్లె మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెడ్డి (27) గంగవరం మండలంలోని అటుకురాళ్లపల్లెలో జరిగిన గంగజాతర నిమిత్తం వచ్చాడు. బుధవారం గ్రామానికి సమీపంలోని ఈతలకుంట చెరువు వద్దకెళ్లిన యువకుడు గల్లంతయ్యాడు. శ్రీనివాసులురెడ్డి ఆచూకీ కోసం రాత్రి 7 గంటల వరకు ఫైర్ సిబ్బంది, పోలీసులు గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో గురువారం వేకువజాము నుంచి చెరువులో 11 గంటల వరకు పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలించినా నీరు అధికంగా ఉండటంతో ఫలితం లేకపోయింది. గ్రామస్థులు, అధికారులు చర్చించి చెరువు గట్టుకు గండి కొట్టి నీటిని బయటకు పంపడంతో మృతదేహం బయటపడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

భర్త వేధింపులతో ఆత్మహత్య

పుంగనూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులతో ఓ వివాహిత ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. సీఐ సుబ్బరాయుడు కథనం మేరకు.. పుంగనూరు సమీపంలోని నక్కబండకు చెందిన బషీర్ కుమార్తె షహీయా (22)ను పట్టణంలోని మేలుపట్ల ప్రాంతంలోని మహబూబ్‌నగర్‌కు చెందిన బాబు కుమారుడు షఫీతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. షహీయాకు పిల్లలు పుట్టలేదని భర్త షఫీతో పాటు తల్లి అఖిల, చెల్లెలు షాహీనా, తండ్రి బాబు వేధించడంతో బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. మృతురాలి తండ్రి బషీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆందోళన పడొద్దు...ఆదుకుంటాం
విమానాశ్రయ భూనిర్వాసితులకు జేసీ, ఎమ్మెల్సీ భరోసా


దండికుప్పం వద్ద ఎయిర్ పోర్టు భూములను పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి

రామకుప్పం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం-శాంతిపురం మండలాల మధ్య ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టు కోసం భూములిచ్చే రైతు కుటుంబాలను ప్రభుత్వం తగురీతిన ఆదుకుంటుందని జాయింట్ కలెక్టరు విద్యాధరి, ఎమ్మెల్సీ శ్రీకాంత్ భరోసా ఇచ్చారు. రామకుప్పంమండల పరిధిలోని కిలాకిపోడు, కడిసినకుప్పం, అంకిరెడ్లపల్లె, మణీంద్రం, బొందలగుంట గ్రామాల పరిధిలోని భూనిర్వాసితులతో రామకుప్పం గురువారం మధ్యాహ్నం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ భూసేకరణలో ఎక్కువగా ఎకరా, రెండెకరాలున్న వారే వున్నామని, ఇళ్ళు, భూములు కోల్పోయే తాము ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంతో వేరే చోటకు వెళ్ళి ఓ ఇంటి స్థలం కూడా కొనలేమన్నారు.తమ భూములకు బదులుగా వేరే చోట భూములివ్వాలని, ఇంటి స్థలాలిచ్చి, పక్కా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన జేసీ, ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎయిర్ పోర్టుతో బాటూ ఇక్కడ ఏర్పాటయ్యే ఇండస్ట్రియల్ కారిడార్‌లో అర్హులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, ఆదుకోవాలని సీఎం నిర్ణయం తీసుకున్నారన్నారు. నష్టపరిహారం పెంచాలని రైతులు కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామని జేసీ హామీ ఇచ్చారు. పట్టా భూములకు అదనపు నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరగా న్యాయస్థానం తీర్పు మేరకు అలా ఇవ్వలేమని స్పష్టం చేశారు.2017-2018లో భూసేకరణకు సంబంధించి నష్ట పరిహారం అందని రైతులకు 15శాతం వడ్డీతో కలిపి త్వరలో చెల్లిస్తామని ఆమె తెలిపారు. తమ భూముల్లోని ఇళ్ళు, వృక్షసంపద, పంటలు, బోర్లు, బావులను పరిహారం విషయంలో పరిగణనలోకి తీసుకోలేదని రైతులు చెప్పగా, మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన జరిపి వాటికి కూడా పరిహారం అందేలా చూస్తామని ఆమె తెలిపారు.ఆర్డీవో శ్రీనివాసరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌బాబు, తహసీల్దారు కౌలేష్, డీటీ బాలాజి, ఆర్ఐ నారాయణప్ప, టీడీపీ నేతలు మునస్వామి, పట్రనారాయణాచారి, ఆనందరెడ్డి. నరసింహులు తదితరులు పాల్గొన్నారు.అంతకుముందు జేసీ శాంతిపురం మండల పరిధిలోని భూనిర్వాసితులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు.దండికుప్పం గ్రామంలో సేకరిస్తున్న భూములను, పండ్ల తోటలను ఆమె పరిశీలించారు.వైసీపీ నాయకుడు, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ భూములను ఎయిర్ పోర్టు పేరుతో లాక్కొంటే తాము రోడ్డున పడాల్సివస్తుందని ఆందోళన వ్యక్తం చేశాడు.మొత్తం 23మంది రైతులు తమ అభిప్రాయాలను అధికారులకు విన్నవించారు. రైతులను నొప్పించి భూములు తీసుకోబోమని స్పష్టం చేశారు. ఎకరాకు రూ.16 లక్షల పరిహారం ఇస్తామని తెలిపారు.

కొనసాగుతున్న ఏనుగుల గుంపు దాడులు


ఏనుగుల గుంపు దాడిలో ధ్వంసమైన మామిడిచెట్లు

కల్లూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. 10 రోజులుగా మండలంలో తిష్ట వేసిన 14 ఏనుగుల గుంపు మామిడి రైతులకు అపార నష్టం కలిగిస్తున్నాయి. మామిడిచెట్లు ధ్వంసం కావడంతో పాటు టన్నుల కొద్దీ కాయలు నేలరాలుతున్నాయి. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బుధవారం రాత్రి బయలుదేరిన 14 ఏనుగుల గుంపు కమ్మపల్లి పంచాయతీ దేశిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకున్నాయి. మాజీ సర్పంచ్ రవీంద్రారెడ్డి మామిడి తోటలోకి చేరుకున్న ఏనుగులు మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. నీటి పైపులను విరిచేశాయి. అక్కడి నుంచి దిన్నె ఎస్సీ కాలనీ మీదుగా దేవళంపేట పంచాయతీ పెనుబాలవారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతు నారాయణ పొలంలోని సుమారు 30 కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. వచ్చిన మార్గంలోనే అడవిలోకి చేరుకున్నాయి గురువారం పగలంతా సూరప్పచెరువు, చింతవంక సమీపంలో ఏనుగులు తిష్ట వేసినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ తెలిపారు.

ఓటరు జాబితా నుంచి మృతుల పేర్లు తొలగిస్తున్నాం

- డీఆర్వో మోహన్‌కుమార్


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా నుంచి మృతుల పేర్ల తొలగింపు ప్రక్రియ చేపట్టినట్లు డీఆర్వో మోహన్ కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. డీఎంహెచ్‌వో, డీఆర్డీఏ శాఖల సమన్వయంతో ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో మృతిచెందిన వారి జాబితాలను సిద్ధం చేశామన్నారు. వాటి ఆధారంగా పేర్ల తొలగింపు చేపట్టామని వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలవారీగా బూత్‌స్థాయి పార్టీ ఏజెంట్ల నియామక జాబితాలను కలెక్టరేట్‌కు అందించాలని నాయకులకు సూచించారు. ఇప్పటివరకు వివిధ అంశాలకోసం 15,497 దరఖాస్తులు అందగా, 1,595 తప్ప మిగిలిన అన్నింటినీ పరిష్కరించామన్నారు. ఈ సమావేశంలో వి.సురేంద్ర కుమార్ (టీడీపీ), ఉదయ్‌కుమార్ రెడ్డి (వైసీపీ), గంగరాజు (సీపీఐ), పరదేశి (కాంగ్రెస్), ఎన్నికల విభాగ కలెక్టరేట్ సూపరింటెండెంట్ వాసుదేవన్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో ఉద్యోగుల బదిలీలు

చిత్తూరు సెంట్రల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో భారీగా ఉద్యోగుల బదిలీలు జరిగాయి. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో అగ్రికల్చర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీకాంత్‌రెడ్డిని చిత్తూరు రూరల్ మహదేవమంగళంలోని సీడ్ మల్టిఫికేషన్ ఫామ్‌కు బదిలీ చేశారు. చిత్తూరు మండల వ్యవసాయ శాఖాధికారి (ఏవో) వి.మాధవిని జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్‌గా డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్‌కు, నగరి ఏవో (టెక్నికల్) ఆర్.అజితను కురబలకోట ఏవోగా, గంగవరం ఏవో ఎన్.హేమలతను పెద్దపంజాణి ఏవోగా, చిత్తూరు ఏవో జి.నీలవేణిని సత్యవేడు ఏవోగా, చిత్తూరు సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లోని ఏవో కె.కళావతిని ఎస్ఆర్‌పురం ఏవోగా, చౌడేపల్లె ఏవో జోతమ్మను పుంగనూరు టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) ఏవోగా, పులిచెర్ల ఏవోను జె.మాధవిని కేవీపల్లె ఏవోగా, సదుం ఏవో ఎస్.హరిప్రసాద్‌ను వైవీపాళ్యం ఏవోగా, చిత్తూరు రూరల్ మహదేవమంగళంలోని సీడ్ మల్టిఫికేషన్ ఫామ్‌లోని ఏవో జి.సుజాతను జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం ఏవోగా, చిత్తూరు డివిజన్ (టీఏ) ఏవో వై.సుధను పలమనేరు ఏడీఏ టీఏ ఏవోగా, వి.కోట ఏవో ఎంబీ రాజ్యలక్ష్మిని గుడుపల్లె ఏవోగా, అక్కడి ఏవో ఎం.నాగరాజును శ్రీసత్యసాయి జిల్లా అగలి ఏవోగా, పుంగనూరు (టీఏ) ఏవో దీపాను యాదమరి ఏవోగా, డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ ఏవో ఎం.సంగీతను గుడిపాల ఏవోగా, రొంపిచెర్ల ఏవో జి.సుధారాణిని మదనపల్లె సాయిల్ టెస్టింగ్ ఏవోగా, ఎస్ఆర్‌పురం ఏవో నర్మదను తిరుపతి సాయిల్ టెస్టింగ్ ఏవోగా, కుప్పం సాయిల్ టెస్టింగ్ ఏవో జి.యామినిని పుత్తూరు (టీఏ) ఏవోగా, పుంగనూరు ఏవో కె.కళ్యాణ్ బాబును తిరుపతి ఏడీఏ సాయిల్ టెస్టింగ్ ఏవోగా, బంగారుపాళ్యం ఏవో కె.చిట్టిబాబును నాగలాపురం ఏవోగా బదిలీ చేశారు.

కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల ప్రదానం


పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు డాక్టర్ రామలక్ష్మి,రోజా ప్రియ,నిరంజన్ రెడ్డి

చిత్తూరు కల్చరల్, జూన్12(ఆంధ్రజ్యోతి): కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల ప్రదాన కార్యక్రమం గురువారం సాయంత్రం చిత్తూరు డీఐ రోడ్‌లోని రాజా మహల్ హోటల్లో వేడుకగా జరిగింది.పురస్కారాలకు ఎంపికైన పద్మా దాశరధి రచన సాహచర్య బంధం నవలను అరుణకుమారి, డీఎన్ సుబ్రమణ్యం రచించిన అగ్రిమెంట్ నవలను రోజాప్రియ, అల్లూరి గౌరిలక్ష్మి రచించిన మలి సంజ కెంజాయ నవలను శ్యామలా దేవి, శాంతి జయప్రకాష్ రచించిన అదృశ్య సంకెళ్ళు నవలను జి.శాంతాదేవి సమీక్షించారు.విజేతలను రూ.10వేల చొప్పున నగదు బహుమతులతో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 10మంది నిరుపేద విద్యార్థినులకు కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ నిర్వాహకులు డాక్టర్ కె. రామలక్ష్మి,డాక్టర్ రోజా ప్రియ, డాక్టర్ నిరంజన్ రెడ్డి స్కాలర్‌షిప్స్ అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవస్థల్లోని లోటుపాట్లను ఎప్పటికప్పుడు సమాజానికి విశదపర్చి చైతన్యపరుస్తున్న సాహితీవేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యంగా కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ 30 సంవత్సరాలుగా ఏటా సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తోందన్నారు.ఈసారి పోటీలకు 35కు పైగా నవలలు వచ్చాయని, వాటిలో ఉత్తమమైన నాలుగు ఎంపిక చేసి సమాన బహుమతులు అందజేశామన్నారు.సాహితీవేత్తలు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, హరినాయుడు, భాస్కర రెడ్డి, మునుస్వామి, గంటామోహన్, కృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు మరో 13వేల క్వింటాళ్ల
వేరుశనగ విత్తనాలు

చిత్తూరు సెంట్రల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మరో 13 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు రానున్నాయి. తొలి దశలో జిల్లాకు 26,639 క్వింటాళ్ల విత్తనకాయలు కేటాయించారు. ఈనెల నాల్గవ తేదీన పంపిణీ ప్రారంభించగా, గురువారం నాటికి 53,747 మంది రైతులకు 21,639 క్వింటాళ్ల విత్తనాలు అందజేశారు. తవణంపల్లె, వెదురుకుప్పం, తదితర మండలాల్లో విత్తనాల కోసం రెండ్రోజులుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో విత్తనాల కొరత అధికంగా ఉన్న క్రమంలో మరో 13వేల క్వింటాళ్లు అవసరం కానుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పరిశీలించిన ప్రభుత్వం అదనపు కోటాను పంపేందుకు ఆమోదం తెలిపింది. రెండో దఫా విత్తనాలు రాగానే కొరత ఉన్న మండలాల్లో పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు.

మోదీ పాలన ఒక స్వర్ణయుగం : బీజేపీ


సమావేశంలో ప్రసంగిస్తున్న భానుప్రకాష్ రెడ్డి

చిత్తూరు సెంట్రల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో 2014 నుంచి ఇప్పటి వరకు మోదీ పాలన ఒక స్వర్ణయుగంలా సాగుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన మేధావులు, పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రధానిగా కాకుండా ఒక సేవకుడిగా నేనున్నానంటూ మోదీ భరోసా దేశ ప్రజలకు ఎంతో సంతృప్తి ఇచ్చిందన్నారు. 11 ఏళ్ల ఒక్క అవినీతి మరక లేకుండా పాలన సాగించడం బీజేపీకి గర్వకారణంగా ఉందన్నారు. అదే కాంగ్రెస్ అయితే దేశంలో పేదరికాన్ని నిర్మూలించలేక పోయిందని గుర్తుచేశారు. బీజేపీ అధికార పగ్గాలు చేపట్టాక 57 కోట్ల మందికి పీఎం గరీబ్ కల్యాణ్ యోజన అమలు చేసిందన్నారు. ఆరుకోట్ల మందికి పీఎం గృహ నివాస్ కింద ఇళ్లు ఇవ్వగా, 15 కోట్ల గృహాలకు తాగునీటి పైప్‌లైన్లు, 12 కోట్ల గృహాలకు మరుగుదొడ్లు, 52కోట్ల మందికి బీమా వర్తింపు, గతంలో 14 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలుంటే నేటికి ఆ సంఖ్య 54 కోట్లకు చేరిందన్నారు. పేదల జన్‌ధన్ ఖాతాలో రూ.43.85 లక్షల కోట్ల నగదు జమచేసి పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. 50వేల కిలో మీటర్లు జాతీయ రహదారులు వేసినట్లు చెప్పారు. బీజేపీ సీనియర్ నాయకులు శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే, మేధావుల సదస్సు రాయలసీమ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రామభద్ర, సత్య తదితరులు పాల్గొన్నారు.

డీసీవో బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్, జూన్12(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకారశాఖ అధికారి (డీసీవో)గా లక్ష్మి బుధవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ప్రస్తుత డీసీవో నాగవర్ధన నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను కార్యాలయ అధికారులు, సిబ్బంది సత్కరించారు. నాగవర్ధనను ప్రభుత్వం తిరుపతి జిల్లాకు డీసీవోగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. చిత్తూరు జిల్లా సహకార ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న బ్రహ్మానందరెడ్డి కూడా తిరుపతి జిల్లాకు బదిలీ కావడంతో గురువారం రిలీవ్ అయ్యారు.

మద్యం మత్తులో అపార్టుమెంటుపై నుంచి పడి మృతి



మృతిచెందిన నాగరాజు

తిరుపతి (నేరవిభాగం), జూన్12 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భవనంపై నుంచి పడి ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ మృతి చెందిన ఘటన గురువారం తిరుపతి రూరల్ మండలంలో చోటు చేసుకుంది. సీఐ చిన్న గోవిందు కథనం మేరకు.. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లెకు చెందిన సారా నాగరాజు(32) తిరుపతిలో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. తాగుడుకు బానిస కావడంతో భార్య వదిలివెళ్లిపోయింది. శ్రీనగర్ కాలనీలో చిన్నాన్న కృష్ణారెడ్డి ఇంట్లో తల్లి సరోజమ్మతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి మద్యం తాగాడు. ఎదురుగా నిర్మాణంలో ఉన్న అపార్టుమెంటు రెండవ అంతస్తుపై పడుకున్నాడు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించే సరికి నాగరాజు కిందపడి ఉన్నాడు. చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నాగరాజు తల్లి సరోజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు 'ఫొటో' కష్టాలు

చిత్తూరు సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాలు , బార్లు సమయపాలన పాటించడంలేదనే ఫిర్యాదులతో ఎక్సైజ్ శాఖ కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. 'ఎక్సైజ్-ఐ' పేరుతో ఓ యాప్‌ను రూపొందించింది. మద్యం దుకాణాలు, బార్లు తీయకముందు, తీసిన తర్వాత, మూసే ముందు, మూసిన తర్వాత ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసే పని కానిస్టేబుళ్లకు అప్పగించింది. ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు మద్యం షాపులు, బార్లు ఫొటోలు తీయాలి.తర్వాత స్టేషన్‌లో విధులకు హాజరుకావాలి. మళ్ళీ రాత్రి 10 గంటలకు మద్యం దుకాణాలు, 11 గంటలకు బార్ల ఫొటోలు తీయాలి. నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, బార్లు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తెరవాలి. ఈ పనివేళల అమలులో ఉల్లంఘనలను తెలుసుకునేందుకు 'ఎక్సైజ్-ఐ' యాప్‌లో రెండు వారాలుగా ప్రతి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉదయం, రాత్రి సమయాల్లో ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. కాగా మందుబాబులు గుమికూడే మద్యం దుకాణాల వద్దకు వెళ్ళి ఫొటోలు తీయడాన్ని కొంతమంది కానిస్టేబుళ్లు ఇష్టపడడం లేదు.ఈ ఫొటో డ్యూటీలు వద్దంటూ ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు


ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక కతృవులు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పినాకిని ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

చిల్లకూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని ఓడూరు సమీపంలో పినాకిని ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు... గురువారం చెన్నై నుంచి విజయవాడ వెళుతున్న పినాకిని ఎక్స్‌ప్రెస్ ఓడూరు రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే ఆవు దూడ అకస్మాత్తుగా పట్టాలపైకి రావడంతో రైలు వాటిని ఢీకొంది. దీంతో రైలు ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. రైల్వే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు చేపట్టడంతో అర్ధగంట ఆలస్యంగా ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది. ఈ ప్రమాదంలో ఆవుదూడ అక్కడికక్కడే మృతిచెందాయి.

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధిదారుల గుర్తింపు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాన సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు తిరుపతి జిల్లాలో అర్హులైన రైతులను గుర్తించినట్లు జిల్లా వ్యవసాయధికారి ప్రసాదరావు తెలిపారు. 1,45,360 మంది రైతులను గుర్తించినట్లు వెల్లడించారు. జాబితాను ఆయా రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామని, అక్కడి సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈనెల 20వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే 3,180మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకున్నారని తెలిపారు. అర్హులకు ఏడాదికి మూడు విడతల్లో రూ.20వేలు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

యోగా మానవాళికి వరం



కేఈసీలో యోగా చేస్తున్న బీసీ నాగరాజ్ తదితరులు

కుప్పం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సర్వ మానవాళికి యోగా ఒక వరమని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈనెల 21న రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించ తలపెట్టిన నేపథ్యంలో దానికి ముందస్తు సన్నాహకంగా కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం యోగాంధ్రపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎదుట బీసీ.నాగరాజ్‌తో సహా అధ్యాపకులు, విద్యార్థులు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా బీసీఎన్ మాట్లాడుతూ భారత దేశంలో సనాతనంగా వస్తున్న యోగా, ధ్యానం వంటివి మానవ జీవితాన్ని ఆయురారోగ్యాలతో ఫలవంతం చేసే విధానాలని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడి దూరమవడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యం యోగాతో చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్ రాజ్, బీసీఎన్ విద్యా సంస్థల కార్యదర్శి ఎన్.సాగర్ రాజ్, యోగా గురువు గణేశ్, ఆర్ అండ్ డి డైరెక్టర్ జీఎన్.కోదండరామయ్య, పీఆర్వో ప్రవీణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మాధవన్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డులో చెత్త ప్రాసెసింగ్ పూర్తి



కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం కంపోస్టు యార్డులో నెలల తరబడి పోగుపడ్డ టన్నుల కొద్దీ చెత్త ప్రాసెసింగ్ గురువారం నాటితో పూర్తయింది. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని మోడల్ కాలనీ సమీపంలో కంపోస్టు యార్డు ఉంది. ఇక్కడ సుమారు నెల క్రితం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ ప్రారంభించారు. యార్డును గురువారం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు ప్రారంభించిన నెల వ్యవధిలోనే మొత్తం చెత్త ప్రాసెసింగ్ చేయడం పూర్తయిందని చెప్పారు.

అనాథకు అంత్యక్రియలు

కుప్పం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి మృతిచెందిన అనాథకు రైల్వే పోలీసులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. రైలులో ప్రయాణిస్తున్న సుమారు 25-30 సంవత్సరాల వయసు కలిగిన యువకుడు ఈనెల 8వ తేదీన కుప్పం రైల్వే స్టేషన్ సమీపంలో రైలునుంచి జారిపడి మృతి చెందిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించిన రైల్వే పోలీసులు, మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నించారు. అయితే మృతుడి వివరాలు తెలియరాకపోవడంతో నాలుగు రోజుల అనంతరం గురువారం డీకేపల్లె శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం పోలీసులకు అవసరమైన సహకారాలు అందించారు.

పిల్లలు తప్పనిసరిగా చదువుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి వంశీకృష్ణ

పుంగనూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలు తప్పనిసరిగా చదువుకోవాలని.. పిల్లల్ని పనిలోకి పంపకండని పుంగనూరు న్యాయమూర్తి వంశీకృష్ణ సూచించారు. గురువారం స్థానిక కొత్తయిండ్లు హైస్కూల్ ఆవరణలో జరిగిన ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు బాల కార్మికులను అన్నివిధాలా ఆదుకుంటాయని, వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో హెచ్ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాతరలో దాడిపై ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన గుండుగల్లు దళిత యువకులు

పలమనేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలం గుండుగల్లు గ్రామంలో ఈనెల 10న అగ్రవర్ణాల వారు తమపై దాడిచేశారని వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ దళితులు గురువారం పలమనేరు డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దళితుల ఫిర్యాదు మేరకు... గుండుగల్లు గ్రామంలో జాతర సందర్భంగా గుడి వద్ద దీపాలు చెల్లించే కార్యక్రమంలో దళితులను గ్రామానికి చెందిన వారు అడ్డుకొన్నారని, గ్రామ పెద్దల వద్దకెళ్లి ప్రశ్నించడంతో సర్పంచ్ రమణ, ఎం.చక్రపాణి, కె.రంజిత్, కె.అమర, ఎస్.జయసింహ, త్యాగరాజు, పి.మణి, డి.బాల, పి.వెంకటేష్, కె.నరేష్, దినేష్, పి.వినోద్, కె.జయంత్‌కుమార్‌తోపాటు వారి అనుచరులు కర్రలతో దళితులపై దాడి చేశారు. దాడిలో అనిల్, చిన్ని అనే వారు గాయపడ్డారు. గాయపడిన వారు పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దళితులపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. గ్రామానికి వచ్చి నేరుగా జరిగిన సంఘటనపై విచారణ చేసి న్యాయం చేస్తామని తెలపడంతో వెనుతిరిగారు.

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం



సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యంతో మధ్యాహ్నం భోజనాన్ని గురువారం రామకుప్పం బాలుర ఉన్నత పాఠశాలలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు కౌలేష్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి, ప్రధానోపాధ్యాయుడు ధనుంజయ, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీరాములు, నేతలు పద్మనాభరెడ్డి, నందారెడ్డి, టీవీరవి, బాలరాజు, సుబ్రీ, నవీన్, సుబ్రహ్మణ్యం, ఆంజీ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైనట్లు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పుంగనూరు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్ తెలిపారు. మండలంలోని ఎంసీపల్లె పంచాయతీ పత్రపల్లెకు చెందిన సరస్వతమ్మ కుమార్తె శిల్ప (20) ఈనెల 8వ తేదీ నుంచి కనబడలేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



ఎంపీడీవోతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఎంపీడీవో కార్యాలయాన్ని గురువారం జడ్పీచైర్మన్ శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా పలమనేరు మండలంలో తాగునీటి సమస్యపై ఎంపీడీవో భాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్‌తో సంప్రదించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జడ్పీ చైర్మన్ తెలిపారు.

ఈకేవైసీ చేసుకున్న రైతులకే 'అన్నదాత సుఖీభవ'

పుంగనూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ చేసుకున్న రైతులకే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని పుంగనూరు వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు మండల పరిధిలో 9,065 మంది, చౌడేపల్లెలో 6,309 మంది, పెద్దపంజాణిలో 7,446 మంది, గంగవరంలో 7,317 మంది, సోమలలో 6,656 మంది, సదుంలో 5,332 మంది, పులిచెర్లలో 5,582 మంది, రొంపిచెర్లలో 4,159 మంది రైతులు ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. రైతులు నాలుగు రోజుల్లోపు రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని కలిసి ఈకేవైసీ చేసుకోవాలని కోరారు.

● **శాంతిపురం:** రాష్ట్ర ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకంలో రైతులకు అందిస్తున్న సాయం పొందాలంటే రైతులు ఆర్బీకే కేంద్రాల్లో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో అప్సోజి తెలిపారు. ఈ అవకాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు రూ.లక్ష విరాళం

సోమల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు గన్నావారిపల్లెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గన్నా బాలాజీ గురువారం రూ.లక్ష విరాళం అందించారని కమిటీ అధ్యక్షుడు మునివెంకటప్ప, కార్యదర్శి ఎస్వీ.రమణ తెలిపారు. అలాగే రాశెట్టివారిపల్లెకు చెందిన వినోద్ కుమార్ రూ.10,116, యధునంద రూ.10,116 విరాళం అందజేసినట్లు కమిటీ కోశాధికారి జ్యోతీశ్వరుడు పేర్కొన్నారు.

సుపరిపాలన ఘనత చంద్రబాబుదే

● గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో సుపరి పాలనను పరిచయం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు అన్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి గురువారం నాటికి సంవత్సరం పూర్తి కావడంతో ఆయన తన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. చంద్రబాబునాయుడు అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వాడుకుంటూ దేశంలోనే ఒక ఆదర్శ పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేసి తరువాత పాలనపై దృష్టి సారించడంతో చంద్రబాబు ఎన్నో అద్భుతాలు సాధించగలిగారని తెలిపారు. చంద్రబాబు పరిచయం చేసిన సుపరిపాలనను ఇప్పుడు దేశమంతటా అనుసరిస్తోందన్నారు. అవినీతిని అరికట్టడంలో భాగంగా నూతన చట్టాలకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ విభాగం సిబ్బందికి జీతాలు పెంచాలి



కమిషనర్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పుంగనూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు జీతాలు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డికి కార్మికులు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈనెల 22 నుంచి 14 రోజులపాటు సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీరాములు, శ్రీకాంత్ రెడ్డి, సురేశ్‌కుమార్, లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడి

పుంగనూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలో మహిళలపై దాడి చేయడంతో గురువారం కేసు నమోదు చేసినట్లు పుంగనూరు ఏఎస్ఐ అశ్వర్థనారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని మంగళం పంచాయతీలోని కంగానెల్లూరుకు చెందిన చిన్న రెడ్డెప్ప కుమార్తెలు శ్యామల, అమరావతి, అంజలి తన పొలంలోని మామిడితోటలో మామిడి కాయలు కోస్తుండగా అదే గ్రామానికి చెందిన గంగులప్ప, చెన్నకేశవులు, జయశంకర్‌లు దాడి చేసి గాయపరిచినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రతి ఇల్లూ సౌరవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం కావాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌బాబు

కల్లూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఇల్లు సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఏపీఎం చంద్రమోహన్, ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ పురుషోత్తం తెలిపారు. పులిచెర్ల స్త్రీ శక్తి భవనంలో గురువారం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై మండలంలోని సంఘమిత్రలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కేవలం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. బ్యాంకర్లు పూర్తి స్థాయిలో సహకరిస్తారని, 7 శాతం వడ్డీతో 90 శాతం రుణం పొందవచ్చన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై సంఘమిత్రలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సీసీ తేజోవతి పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసం

పలమనేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని లింగాయతివీధి, లక్ష్మణ్‌సింగ్ వీధుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు మాబాషా, హరినాథ్, హరి, అంగన్‌వాడీ కార్యకర్తలు మహేశ్వరి, లత, ఎంఎస్‌కేలు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం మేరకే భూసేకరణ

● జాయింట్ కలెక్టర్ విద్యాధరి



రామకుప్పంలో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి



శాంతిపురంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ

శాంతిపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయం మేరకే రైతుల నుంచి భూసేకరణ చేపడుతామని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. గురువారం శాంతిపురంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు భూ బాధితులతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. తమ భూములు పోతే జీవనాధారం కష్టమవుతుందని, ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఏమాత్రం చాలదని, చదువుకొన్న వారికి ఉద్యోగ భద్రత కల్పించి భూములకు బదులు భూములు ఇవ్వాలని, కొందరు అధికారులు తమను భయపెడుతున్నారని వాపోయారు. 23 మంది రైతులు వారి వారి అభిప్రాయాలను అధికారులకు విన్నవించారు. అలాగే గతంలో ఎయిర్‌పోర్టు కోసం తమ భూములు తీసుకున్నారని, పరిహారం రాలేదని నారాయణప్ప అనే రైతు వాపోయారు. స్పందించిన జేసీ రైతులను బెదిరించినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతి రైతు అభిప్రాయం మేరకే భూములు సేకరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు ఎకరాకు రూ.16 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గతంలో పరిహారం అందని రైతులకు వడ్డీ లెక్కేసి ఇవ్వడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దారు శివయ్య, ఎంపీడీవో కుమార్, కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు అనసూయ, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు శ్యామల, మండల యూనిట్ ఇన్‌చార్జిలు, అధికారులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా కుప్పం అభివృద్ధి



కుప్పంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ తదితరులు



పలమనేరు టీడీపీ కార్యాలయంలో..



శాంతిపురంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కుప్పం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో చరిత్రలో నిలిచేలా కుప్పం నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కుప్పం పార్టీ కార్యాలయంలో గురువారం భారీ కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ అమరావతి రాజధాని అభివృద్ధికి ప్రణాళిక రచించిన ప్రతిష్ఠాత్మకమైన సింగపూర్ కంపెనీ ప్రతినిధులు ఇప్పటికే కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళిక తయారు చేసిందన్నారు.

కుప్పం పట్టణంలో రోడ్డు విస్తరణ పనులను త్వరలోనే చేపడుతామన్నారు. ఒకవైపు ఎయిర్ పోర్టు నిర్మాణానికి భూ సేకరణ పూర్తయిందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్టీఆర్ స్టేడియం సంపూర్ణ అభివృద్ధికి మరోవైపు టెండర్లు పూర్తయ్యాయని చెప్పారు. ఇంకా అన్ని రంగాలలో కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో కుప్పంలో జరిగి తీరుతుందని తెలిపారు. కుప్పం రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ నాయకులందరూ ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధి ఎవరూ ఊహించలేనంతగా త్వరలోనే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, నాయకులు వీజీ ప్రతాప్, పి.గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, కౌన్సిలర్లు జిమ్ దాము, సోము, మణి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరులో గురువారం కూటమి నేతలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంగౌడు, పలమనేరు టౌన్, రూరల్, గంగవరం, పెద్దపంజాణి మండలాల పార్టీ అధ్యక్షులు ఆర్బీసీ కుట్టి, నాగరాజరెడ్డి, సోమశేఖర్ గౌడు, ఆనంద్, నాయకులు గిరి, నాగరాజు, ఖాజా, ప్రతాప్, అమరనాథ్‌రెడ్డి, రూపేష్, కిరణ్, సుధాకర్, జనసేన నాయకులు దిలీప్, హరీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● **శాంతిపురం :** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావడంతో టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. గురువారం మండల పార్టీ కార్యాలయ ఆవరణలో మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్‌నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ తదితరులు భారీ కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, నేతలు మణి, గోపాల్, నాగరాజు, రాజేంద్ర, శివ, చలపతి, జైపాల్, లోకేష్, విజయకుమార్, రమేష్, గోవిందరాజులు, అనసూయ, శ్యామల, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రామకుప్పం టీడీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్ట నారాయణాచారి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగు యువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, నేతలు రామ్మూర్తి, గంట్లప్పగౌడు, కృష్ణానాయక్, నరసింహులు, నందారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జయశంకర్, అవినాశ్, మురళీ, నవీన్, సురేష్, మురళీ, సుబ్రహ్మణ్యం, రామలింగారెడ్డి బాలరాజు, సుబ్రీ, అల్లీశీన, ఆంజీ, భానుమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



కుప్పం ఆర్‌పేట ఉన్నత పాఠశాలలో...

కుప్పం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని ఆర్.పేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను గురువారం టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు, కడా సలహా మండలి సభ్యుడు ఎస్.రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్‌లు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలు వినియోగించుకొని బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె :** స్థానిక ఎమ్మార్సీ సమీపంలోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు గురువారం ఎంఈవో కేశవరెడ్డి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే కోటూరు ప్రాథమిక పాఠశాలలోనూ అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరత్నమ్మ, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకుడు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

● **సోమల:** ప్రభుత్వ బడులు పునఃప్రారంభం కావడంతో గురువారం మొదటి రోజునే స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంఈవో శివరత్న ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం హేమసుధాకర్, జ్యోతీశ్వరుడు, పీడీ కరుణానిధి, సోమల టీడీపీ అధ్యక్షుడు శివశంకర్, మహేంద్రబాబు, మల్లికార్జున, సదాశివయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె :** బైరెడ్డిపల్లెలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల, కడపనత్తం ఉన్నత పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు సర్వేపల్లె రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్లను టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, ఎస్ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల:** మండలంలోని చిచ్చిలివారిపల్లెలో గురువారం ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, రొంపిచెర్ల ఉర్దూ పాఠశాలలో ఎంఈవో శ్రీనివాసులు, స్కూల్ కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

● **పుంగనూరు:** సీఎం చంద్రబాబునాయుడు పాలనలో ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు టీడీపీ నాయకులు సీవీరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నతపాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను పాఠశాల హెచ్ఎం రుద్రాణితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శ్రీకాంత్, ఉపాధ్యాయులు, అమరావతి సురేశ్, వాణి తదితరులు పాల్గొన్నారు.



చౌడేపల్లెలో..

● **సదుం:** మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈవోలు సిద్దరామయ్య, దామోదరం, నాయకులు శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** రామకుప్పం బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్య, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు కౌలేష్, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, ప్రధానోపాధ్యాయుడు ధనుంజయ, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీరాములు, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, విశ్వనాథ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల గేట్లకు తాళం వేసి నిరసన



పుంగనూరు: మార్లపల్లె పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పుంగనూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పక్క గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపలేమని పుంగనూరు మండలంలోని రెండు పాఠశాలలకు తాళాలు వేసి విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. గురువారం వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో మండలంలోని 28 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను పక్కగ్రామాల పాఠశాలలకు బదిలీ చేశారు. మండలంలోని మార్లపల్లె ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 చదువుతున్న విద్యార్థులను సింగిరిగుంటకు వెళ్లాలని టీచర్ చెప్పడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో పాఠశాల వద్దకు చేరుకున్న తల్లిదండ్రులు గేట్లకు తాళాలు వేసి తమ పిల్లలకు ఇదే పాఠశాలలోనే చదువు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి ఎంఈవో నటరాజరెడ్డి, రెడ్డెన్నశెట్టి అక్కడకు చేరుకుని పరిస్థితిని వివరించినా తల్లిదండ్రులు అంగీకరించలేదు. తమ పిల్లలు సింగిరిగుంటకు వెళ్లాలంటే మార్గమధ్యలో హంద్రీ-నీవా కాలువ ప్రవహిస్తోందని, పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని నిలదీశారు. అలాగే గోపిశెట్టిపల్లె పాఠశాల ప్రారంభించిన ఉపాధ్యాయులు 3, 4, 5 తరగతి విద్యార్థులను మేలుదొడ్డి పాఠశాలకు వెళ్లాలని చెప్పడంతో తల్లిదండ్రులు నిరసన తెలిపారు.



బైరెడ్డిపల్లె : మూగనపల్లె పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మూగనపల్లెలో....

● **బైరెడ్డిపల్లె:** మూగనపల్లె ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను నాచుకుప్పం పాఠశాలలో విలీనం చేయొద్దని గ్రామస్థులు గురువారం పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. పాఠశాలను విలీనం చేయకుండా ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పిల్లలు ఇతర ప్రాంతలకు వెళ్లరని వాపోయారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

'మామిడి' టోకెన్ల కోసం తోపులాట

● తహసీల్దార్ జోక్యంతో సద్దుమణిగిన వివాదం



ఫ్యాక్టరీ మేనేజర్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్ జయంతి

గుడిపాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయలను తరలించడానికి ఫ్యాక్టరీ యజమానులు ఇచ్చే టోకెన్ల విషయంలో తోపులాట జరిగింది. తహసీల్దార్, స్థానిక నాయకుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. గుడిపాల మండల పరిధిలోని నీకేపల్లె వద్ద ఉన్న తాజా మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీని రెండ్రోజుల కిందట కలెక్టర్ సుమిత్‌కుమార్ తనిఖీ చేశారు. మామిడి కాయలను సరఫరా చేసే రైతులకు రోజుకు వంద టోకెట్లను ఇవ్వాలని ఫ్యాక్టరీ యజమానులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయితే యాజమాన్యం మాత్రం రెండ్రోజులకు కలిపి ఒకే రోజు టోకెట్లను ఇవ్వడంతో ఫ్యాక్టరీ సిబ్బంది, రైతుల మధ్య తోపులాట జరిగింది. ఇలా టోకెన్లు ఇస్తే రోజువారీగా కాయలను తెచ్చేవారు ఏమవ్వాలని రైతులు ప్రశ్నించారు. వాగ్వాదం పెద్దది కావడంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ జయంతి, స్థానిక టీడీపీ నేతలు చెన్నకేశవులు నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, బాలాజీ నాయుడులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. ఫ్యాక్టరీ మేనేజర్ రామ్‌కీతో మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా టోకెన్లను ఇవ్వాలని సూచించడంతో వివాదం సద్దుమణిగింది.

మద్దతు ధరకే 'తోతాపురి' కొనుగోలు చేయండి: ఆర్డీవో



గుజ్జు పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడుతున్న ఆర్డీవో భవాని

బంగారుపాళ్యం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే తోతాపురి మామిడి కాయలను కొనుగోలు చేయాలని గుజ్జు పరిశ్రమ యాజమాన్యానికి పలమనేరు ఆర్డీవో భవాని సూచించారు. గురువారం ఆమె నలగాంపల్లెలో ఉన్న సన్‌గోల్డ్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడారు. రైతుల నుంచి కిలో రూ.8కి కొనుగోలు చేయాలని ఫ్యాక్టరీ మేనేజర్ ధనంజయనాయుడికి సూచించారు. అలాగే ర్యాంప్‌ల వద్ద కూడా తోతాపురి రకానికి కిలో రూ.8 ఇవ్వాలన్నారు. గుజ్జుపరిశ్రమకు మామిడి తరలించే రైతులు తమ ఆధార్, బ్యాంకు, భూమి పాస్‌పుస్తకాల జెరాక్స్‌లను సంబంధిత అధికారులకు అందజేస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. ఇలా నమోదు చేసుకున్న రైతులకే ప్రభుత్వం అందించే సబ్సిడీ రూ.4 బ్యాంకు ఖాతాల్లో జమవుతుందని తెలిపారు. తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, గ్రామ ఉద్యాన శాఖ సహాయకురాలు కోకిల, వీఆర్వో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాలసముద్రం మండలాభివృద్ధికి సహకరించండి

● అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరిన ఎంపీపీ

పాలసముద్రం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలాభివృద్ధికి సహకరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను ఎంపీపీ శ్యామల కోరారు. ఎంపీడీవో ఆఫీస్‌లో గురువారం తన అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రసంగించారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. మామిడి రైతుల కష్టాలను గుర్తించి వారికి త్వరగా పర్మిట్లు ఇప్పించాలని ఏవో డిల్లీబాబును కోరారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఏవో చెప్పారు. తాగునీటి ఇబ్బందులను తీర్చడానికి ఆరు గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లను సిద్ధం చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్ తెలిపారు. మండలంలో మూడునెలల్లో రూ.50లక్షల పనులు చేశామని పీఆర్ ఏఈ జయరాజ్ తెలిపారు. మండలానికి వేరుశనగ విత్తనకాయలు చాలడంలేదని గంగమాంబపురం సర్పంచ్ హరి, పలువురు సభ్యులు తెలిపారు. ఏవో మధువాణి, ఇరిగేషన్ ఏఈ చీరాలయ్య, హౌసింగ్ ఏఈ దాము, ఎంఈవో రాజేంద్రప్రసాద్, ఏపీవో మార్గరెట్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కాలువ పోరంబోకు భూమిలో ప్రహరీ తొలగింపు



ప్రహరీని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి

చిత్తూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరువారం రెవెన్యూ గ్రామ సర్వే నెంబరు 250లో హరిభూషణం అనే వ్యక్తి తన పట్టా భూమితోపాటు కాలువ పోరంబోకు భూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మించాడని స్థానికురాలు మేరీ చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర రెడ్డికి ఫిర్యాదు చేశారు. గురువారం సర్వేయర్, ఏఎస్‌వో కలిసి ఆ భూమిని తహసీల్దార్ పరిశీలించారు. సర్వే చేయించగా కాలువ పోరంబోకు భూమిలో ప్రహరీ ఉందని గుర్తించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో గోడను తొలగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు: ఎస్ఈ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీహరి

విజయపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకూడదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీహరి ఆదేశించారు. మండలంలోని ఇళ్లత్తూరులో రాజీవ్ టెక్నాలజీ ఆర్‌డబ్ల్యూఎస్ స్కీమ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. డీఈ శర్మ, ఏఈఈ హరి, మాజీ కోఆప్షన్ మెంబరు ఏళుమళై, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిధులొచ్చినా.. రోడ్డు నిర్మించరా?

● చిన్నకలిగిరి గ్రామస్తుల ఆవేదన



సమస్యను తెలియజేస్తున్న చిన్నకలిగిరివాసులు

పెనుమూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తమకు అవసరమైన రోడ్డు నిర్మించడానికి నిధులొచ్చినా పనులు మొదలు పెట్టకుండా కాలయాపన చేయడమేంటని చిన్నకలిగిరి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నకలిగిరి గ్రామం పెనుమూరు-పూతలపట్టు మండలాలకు ఆనుకుని ఉంది. ఈ గ్రామంలో అంతా బీసీ కులానికి చెందినవారే. వీరిలో 40 కుటుంబాలు తమ పూర్వీకుల కాలం నుంచి తిరుపతి-చిత్తూరు హైవేకి అటువైపుగా ఉంటున్నాయి. రేషన్ కార్డు, ఓటు హక్కు అంతా పెనుమూరు మండల పరిధిలో ఉన్నాయి. వీరుంటున్న ఇళ్లు మాత్రం పూతలపట్టు మండలం వడ్డేపల్లె రెవెన్యూ పరిధిలోకి వస్తాయి. ప్రభుత్వం మారిన వెంటనే జాతీయ రహదారి నుంచి నివాసాల వద్దకు ఎంపీ సిఫారసుతో రూ.20 లక్షల ఉపాధి నిధులతో సిమెంటు రోడ్డు మంజూరైంది. రోడ్డు వేయడానికి పంచాయతీరాజ్ అధికారులు సైతం ఆమోదయోగ్య సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. కానీ పెనుమూరు ఎంపీడీవో మాత్రం అది పక్క మండల పరిధిలో ఉందని.. రోడ్డు వేయడానికి అనుమతులు ఇవ్వలేమని నిరాకరించారు. సుమారు ఆరు నెలలుగా మంజూరైన రోడ్డును వేయకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా తమ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

నేడు మండల సమావేశం

తవణంపల్లె, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరుగుతుందని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

అక్షరాభ్యాస కార్యక్రమం

గుడిపాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కిలారుపల్లెలోని అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కృష్ణ ప్రభు, సీడీపీవో శ్యామసుగుణ కుమారి, సూపర్‌వైజర్ తేయజాక్షి, బీజేపీ నేత స్వామినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి: సీడీపీవో

వెదురుకుప్పం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సిబ్బంది, ఐసీడీఎస్ ఉద్యోగులు సమయపాలన పాటించాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీడీపీవో శోభారాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని చెప్పారు. ఆమెను అంగన్వాడీ కార్యకర్తల సంఘ నాయకులు సత్కరించారు.





చిత్తూరులో కురుస్తున్న వర్షం

నగరంలో భారీ వాన

చిత్తూరు కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చర్చి, పొన్నియమ్మ, బజారు, శేషాపిరాన్ వీధులతోపాటు డీఐ రోడ్డు, గాంధీరోడ్డు, హైరోడ్డు, మిట్టూరు, ఎంఎస్ఆర్ సర్కిల్, దర్గా, గిరింపేట తదితర ప్రాంతాల్లో వర్షపు నీటి ప్రవాహం కనిపించింది. కాలువలు పొంగడంతో రోడ్లపై మురుగు పారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

వెదురుకుప్పంలోనూ..

వెదురుకుప్పం: వెదురుకుప్పంలోనూ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది.

మార్కెట్ యార్డు జలమయం



చిత్తూరు సెంట్రల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి మార్కెట్ యార్డు జలమయమైంది. దీంతో ఇటు వ్యాపారస్తులు, అటు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ యార్డులో చెత్త పేరుకోవడం వల్లే చిన్నపాటి వర్షానికే ఇలా జరుగుతోందని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మా పాఠశాలను కొనసాగించాలి

రసూల్‌నగర్‌వాసుల రాస్తారోకో / అధికారులు సర్దిచెప్పడంతో విరమణ

యాదమరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలను కొనసాగించాలని యాదమరి మండలంలోని రసూల్‌నగర్ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పాఠశాల ముందు రహదారిపై విద్యార్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఇక్కడున్న బడిలో 3, 4, 5 తరగతి చదువుతున్న 20మంది విద్యార్థులను రెండు కిలోమీటర్ల దూరంలోని దళవాయిపల్లె పాఠశాలలో కలిపారు. దీనిపై గ్రామస్తులు నిరసన తెలిపారు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని చెప్పారు. సమస్యను ఇప్పటికే కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో వేణు, ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. విద్యార్థుల నైపుణ్యాలు, ఉత్తమ మౌలిక సదుపాయాల కల్పన పెంపులో భాగంగానే ఈ మార్పులు చేశామని వివరించడంతో గ్రామస్తులు నిరసన విరమించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో, ఎంఈవో తదితరులు

మా బడిని మార్చకండి సారూ..!



పాఠశాల వద్ద నినాదాలు చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మా బడిని మార్చకండి సారూ..! అంటూ చిత్తూరు మురకంబట్టు అగ్రహారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు గురువారం పాఠశాల ముందు నినాదాలు చేశారు. అన్ని సౌకర్యాలున్న గ్రామంలోని తమ బడిని మోడల్ స్కూల్ పేరుతో కిలోమీటరు దూరంలో కనీస సౌకర్యాలు లేని ఎంపీపీ పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలోని పాఠశాలలో క్రీడా మైదానం, నీటి వసతి, ఆహ్లాదకర వాతావరణం ఉందన్నారు. తమ బడిని ఇక్కడే కొనసాగించాలని లేకుంటే తాము ఇతర పాఠశాలలకు వెళతామని స్పష్టం చేశారు. నిరసన తెలిపిన వారిలో పాఠశాల విద్యార్థులు, గ్రామానికి చెందిన చెందిన ప్రతిమ, సతీష్, గాయత్రి, మౌనిక, లత, మునెమ్మ, వనజ తదితరులు ఉన్నారు.

ఈకేవైసీ చేసుకుంటేనే 'అన్నదాత సుఖీభవ'

వెదురుకుప్పం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులంతా ఈకేవైసీ చేయించుకుంటే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని వెదురుకుప్పం వ్యవసాయాధికారి సి.వనిత గురువారం తెలిపారు. సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ అజీజ్ తదితరులు

నగరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, లేబర్ ఇన్‌స్పెక్టర్ మోహన్ పిలుపునిచ్చారు. ప్రపంచ బాలకార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం నగరిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న ఓ దుకాణాదారుడిపై కేసు నమోదు చేశారు. స్థానికులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి అదృశ్యమైన సంఘటనపై రెండో పట్టణ పోలీసులు కేసు కేసు నమోదు చేశారు. సంతపేటకు చెందిన జయశ్రీ(19) నగరంలోని ఫ్యాన్సీ స్టోర్‌లో పనిచేస్తుంది. రెండ్రోజుల కిందట ఇంటి నుంచి షాపునకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు తెలిసిన వారిళ్లలో వెతికారు. ఆచూకీ తెలియక పోవడంతో ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీపై ఐసీడీఎస్ సిబ్బంది రాక

గంగాధరనెల్లూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్‌కు కొత్తగా ఇద్దరు సూపర్‌వైజర్లతోపాటు సీనియర్ అసిస్టెంట్, సబార్డినేట్ విధుల్లో చేరారు. బంగారుపాళ్యం మండలంలో సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న పి.జయశ్రీ, పి.రెడ్డికల్యాణి, చిత్తూరు పీడీ ఆఫీస్‌లో పనిచేస్తున్న భారతి, బంగారుపాళ్యంలో పనిచేస్తున్న సబార్డినేట్ శంకర్‌లు కొత్తగావిధుల్లో చేరారు. అనంతరం సీడీపీవో పద్మసునందను మర్యాదపూర్వకంగా కలిశారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి గ్రామసభ ఆమోదం

బంగారుపాళ్యం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తుంబ గ్రామ పంచాయతీలోని తుంబ ఎస్టీ కాలనీ నుంచి జగమర్ల పంచాయతీ దేవళంపేట ఎస్టీ కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి గ్రామసభలో ఆమోదించినట్లు తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కలెక్టర్, జిల్లా అటవీశాఖ ఆదేశాలతో తుంబ సర్పంచ్ ఉషశ్రీ అధ్యక్షతన గురువారం ఎస్టీ కాలనీ ప్రజలతో గ్రామసభ జరిగిందన్నారు. 1.7 కిలోమీటర్ల రిజర్వు ఫారెస్టులో బీటీ రోడ్డు నిర్మిస్తే తమ గ్రామాలకు రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని ఎస్టీ కాలనీ ప్రజలు తెలిపారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మండల సర్వేయర్ లావణ్య, ఎఫ్ఎస్‌వో మోహన్‌మురళి, ఎఫ్‌బీవో మనోజ్, వీఆర్వో నవీన్, ఉపసర్పంచ్ చిరంజీవి, మాజీ ఎంపీటీసీ శివరాజు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలి



విద్యార్థినికి బ్యాగు అందజేస్తున్న టీడీపీ నేతలు

గుడిపాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ ఇష్టపడి చదివి, ఉన్నత స్థాయికి ఎదగాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నేతలు చెన్నకేశవులు నాయుడు, బాలాజీ నాయుడు అన్నారు. గురువారం నరహరిపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. విద్యాశాఖ పీవో వెంకట్రామయ్య, హెచ్‌ఎం దుర్వాసులు, విద్యా కమిటీ ఛైర్‌పర్సన్ డిల్లీబాయి, తెలుగు యువత అధికార రాష్ట్ర ప్రతినిధి హేమాద్రి నాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజయాదవ్, టీడీపీ నేతలు సాంబశివనాయుడు, మునస్వామి, టీచర్లు పాల్గొన్నారు.









నగరి, పూతలపట్టు, పెనుమూరు, గంగాధర నెల్లూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ నాయకుల సంబరాలు

నగరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం ఏడాది సుపరిపాలన పూర్తవడంపై గురువారం టీడీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. నగరి టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, కార్యదర్శి వేణు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, దేశమ్మగుడి మాజీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● నగరి ఒకటోవార్డు టీడీపీ నాయకులు చలపతి, లత ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పుష్పాభిషేకం చేశారు. సామాలమ్మగుడివద్ద విద్యార్థులకు స్వీట్లు పంచారు.

పూతలపట్టు: మండలకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, ఐరాల, బంగారుపాళ్యం, యాదమరి, తవణంపల్లె అధ్యక్షులు గంగారపు హరి, ధరణి ప్రసాద్, మొరార్జీ యాదవ్, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాలసముద్రం మండలంలోని బలిజకండ్రిగలో అన్నదానం

పెనుమూరు: టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, నాయకులు ఈశ్వర్‌ప్రసాద్, అశోక్, వేణునాయుడు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: బస్టాప్ కూడలిలో టీడీపీనేతలు కేక్‌కట్‌చేశారు. సంబరాలు చేసుకున్నారు.

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, టీడీపీ జిల్లా ప్రత్యేక ఆహ్వానితుడు లోకనాథం నాయుడు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండల కేంద్రంతోపాటు బలిజకండ్రిగ, రంగాపురం కూడలి ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి వాసునాయుడు, నేతలు రవినాయుడు, వెంకటేశులు నాయుడు, మాధవరాజు, తంగరాజ్, మోహన్, వాసుయాదవ్, బాబుయాదవ్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు యువత జీడీనెల్లూరు అధ్యక్షుడు గురుసాల కిషన్ చంద్, క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్ మురళి, నేతలు పాల్గొన్నారు. ●కార్వేటినగరం గాండ్లమిట్టకూడలిలో జరిగిన కార్యక్రమంలో నేతలు వాసుదేవరెడ్డి,జనార్ధన్‌రాజుతదితరులు పాల్గొన్నారు.







ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం, కార్వేటినగరంలో జరిగిన సంబరాల్లో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

సంక్షిప్తంగా..

పాఠ్య పుస్తకాల పంపిణీ

తవణంపల్లె, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలను ఎంఈవో హేమలత పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: తూగుండ్రం హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. హెచ్‌ఎం రాజేంద్రనాయుడు, స్కూలు కమిటీ ఛైర్మన్ కాణిపాకం సుధాకర్, టీడీపీ నేతలు నరసింహులునాయుడు, జీవరత్నం, శాంతకుమార్, శేఖర్ శెట్టి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

విజయపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విజయపురం అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం సీడీపీవో ఇందిరప్రియదర్శిని తనిఖీ చేశారు. సూపర్‌వైజర్ లక్ష్మి, కార్యకర్తలు హైమావతి, విజయతదితరులు పాల్గొన్నారు.

పురవీధుల్లో మాతమ్మ విహారం



వెదురుకుప్పం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం తూర్పు అరుంధతివాడలోని మాతమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర హారతులు పట్టారు. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేణుగోపాలుడి హుండీ ఆదాయం రూ.1.25లక్షలు



వెదురుకుప్పం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోనిరుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి హుండీ లెక్కింపు ద్వారా రూ.1,25,757 ఆదాయం వచ్చినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు.లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం చేపట్టినట్లు చెప్పారు. ఆలత్తూరులోని వరదవెంకటేశ్వర స్వామి ఆలయహుండీ లెక్కింపులో రూ.1,822 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు తవణంపల్లె మండలం మైనగుండ్లపల్లెకు చెందిన రాజారెడ్డి గురువారం రూ.1,01,116 విరాళంగా అందించారు. దాతకు ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లు చేశారు. కాగా, స్వామివారిని ఏపీ ఎన్విరాన్‌మెంట్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులురెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తహసీల్దార్‌కు సన్మానం

విజయపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కిరణ్‌ను ఆయన కార్యాలయంలో గురువారం రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. డీటీ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, ఆర్ఐ మార్కండేయులు, వీఆర్వోలు మేఘనాథం, వెంకటేసులు, చంద్రయ్య, విజయకుమార్, దొరస్వామి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో పరిశీలన

పూతలపట్టు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చిటిపిరాళ్ల పంచాయతీ పరిధిలోని డంపింగ్ యార్డును గురువారం డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.